క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దేముల్: రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్) సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు బ్యాంకు మేనేజర్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11గంటలకు సమీక్ష జరగనుందని, సంఘం సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అతివల అభ్యున్నతికి కృషి



అధికారిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

దోమ: ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతికి అందిస్తున్న ప్రోత్సాహకాలను సంఘాల ప్రతినిధులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు శ్రద్ధ చూపాలని అడిషనల్ ఆర్డీఓ సరోజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన ఈసీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఈసీ సభ్యులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎం రామ్మూర్తి, ఎంపీడీఓ మహేశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటు హక్కు పొందండి



తహసీల్దార్

తాండూరు రూరల్: అర్హులైన యువతీయువకులు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తారాసింగ్ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు.. బీఎల్‌ఓల వద్ద ఫారం–6 ద్వారా, ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్యలున్నాయా?

- గ్రామాల్లో ట్రాన్స్‌కో స్పెషల్ డ్రైవ్



విద్యుత్ సమస్యలపై ఆరాతీస్తున్న ఏఈ నాగరాజు, సిబ్బంది

బొంరాస్‌పేట: విద్యుత్ సమస్యలపై ట్రాన్స్‌కో అధికారులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ప్రతి బుధవారం సిబ్బంది, అధికారులు గ్రామాల్లో పర్యటించి కరెంటు సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారం కోసం తగిన తక్షణ చర్యలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ఏఈ నాగరాజు పలు కాలనీల్లో పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకొని నమోదు చేసుకున్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇలా ప్రతి వారం గ్రామాల్లో పర్యటించి, కరెంటు సమస్యలు తెలుసుకోనున్నట్లు ఏఈ వెల్లడించారు.

అరెస్టులు బాధాకరం

షాబాద్: ముందస్తు అరెస్టులు బాధాకరమని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ క్లెం సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా బోడంపహాడ్ గ్రామంలో ఏబీవీపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి షాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయాన్ని హైకోర్టు నూతన భవనానికి కేటాయించడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిరాగానే యూనివర్సిటీ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తుందని విమర్శించారు. యూనివర్సిటీలో 100 ఎకరాల భూమిని హైకోర్టుకు కేటాయిస్తూ జీఓ నంబర్ 55ను విడుదల చేయడం హేయమైన అని, శంకుస్థాపనను అడ్డుకుంటారనే భయంతోనే ముందస్తు అరెస్టు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆశ కార్యకర్త

బొంరాస్‌పేట: డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. మండల పరిధి రేగడిమైలారంలో ఓ బాలుడికి మూడురోజుల క్రితం డెంగీ నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో వ్యాధి గురించి గ్రామంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ.. జాగ్రత్తలను సూచించారు. మురుగునీరు, రబ్బరు బకెట్లు, పాతటైర్లు, అపరిశుభ్రం, నిలువ ఉండే పాత సామగ్రి దోమల పెరుగుదలకు కారణం అవుతాయని, వాటి వలన మనిషి వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వ్యాధి సోకిన వారు.. నిర్లక్ష్యం చేయకుండా మెరుగైన చికిత్స తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ మణిమాల, ఆశలు అనిత, నాగమణి ఉన్నారు.

కాంతి తగ్గిన 'దారిదీపం'

- నిరుపయోగంగా గ్రంథాలయం
- 'పోటీ' పరీక్షలకు జ్ఞాన సంపద నిల్
- రెండేళ్లుగా లైబ్రేరియన్ పోస్టు ఖాళీ
- పాఠకుల ఆదరణకు నోచుకోని భాండాగారం





మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయం. (ఇన్‌సెట్లో) రీడింగ్ రూం

యాలాల: సామాజిక ఉన్నతికి మార్గదర్శిగా పేరొందిన 'దారిదీపం' కాంతి తగ్గుతోంది. సగటు మనిషికి విశేష జ్ఞాన సంపదను ప్రసాదించే పుస్తక భాండాగారం బోసిపోతోంది. లైబ్రేరియన్ లేక, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేక.. క్రమంగా పాఠకుల ఆదరణ కోల్పోయింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన గ్రంథాలయం.. ఎవరికీ ఏ విధంగానూ ఉపయోగపడకుండా.. నిర్లక్ష్యానికి గురై.. ఉద్యోగ ప్రకటనలు వెలువడుతున్న నేపథ్యంలో.. పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యేవారికి శాపంగా మారింది.

స్వీపర్‌కు బాధ్యతలు!

యాలాల మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో 13వేలకు పైగా వివిధ రకాల పుస్తకాలు ఉన్నాయి. వీటిలో నవలలు, చరిత్ర, ఆత్మకథలు, కథలు ఇలా అనేక అంశాలు దాగున్న పుస్తక సంపద ఉంది. అయితే.. ప్రస్తుత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి అవసరమయ్యే బుక్స్ అందుబాటులో లేవు. లైబ్రేరియన్ లేకపోవడమే ఇందుకు కారణం అని తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన అశోక్ కుమార్.. బషీరాబాద్‌కు బదిలీ కావడంతో ఇక్కడ స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వయోజనుడికి ఇన్‌చార్జి లైబ్రేరియన్‌గా బాధ్యతలు అప్పగించారు. మరికొద్ది రోజుల్లో ఆయన రిటైర్ కాబోతున్నారు.

అరకొర పత్రికలతో సరి..

మండల కేంద్రంతో పాటు, చుట్టుపక్కల గ్రామాల్లో అనేక మంది బీఈడీ, డీఈడీ, ఇతర ఉన్నత చదువులు పూర్తి చేసి, ఉద్యోగ వేటలో ఉన్నారు. ప్రస్తుతం టెట్‌తో పాటు డీఎస్సీ కోసం సన్నద్ధమవుతున్నారు. ఇటువంటి వారి కోసం ఎన్నో రకాలుగా ఉపయోగ పడాల్సిన లైబ్రరీ.. ప్రస్తుతం ఆ దిశగా సేవలందించడం లేదు. కేవలం దినపత్రికలు, కొద్ది పాటి పుస్తకాలతో కాలం నెట్టుకొస్తోంది.

కనుమరుగైన బీడీసీలు..

గతంలో మేజర్ పంచాయతీ గ్రామాల్లో శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో బీడీసీ(బుక్ డిపాజిట్ సెంటర్)లు ఏర్పాటు చేసేవారు. ఈ సెంటర్లలో దినపత్రికలతో పాటు పోటీ పరీక్షల పాఠ్య పుస్తకాలను అందుబాటులో ఉంచేవారు. అనంతరం బీడీసీల స్థానంలో పీఆర్ఆర్(పంచాయతీ రీడింగ్ రూం)లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మండలంలోని ఒక గ్రామంలో ఈ పీఆర్ఆర్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, ఫలితం శూన్యం. ఈ విషయంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రంథాలయాల్లో అవసరమైన జ్ఞాన సంపదతో పాటు, సౌకర్యాలను కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

పుస్తకాల సంఖ్య పెంచాలి



పేరుకు గ్రంథాలయం ఉన్నప్పటికీ.. ఇందులో పోటీ పరీక్షల పుస్తకాల సంఖ్య తక్కువగా ఉంది. ఇది సర్కారు కొలువుల సాధనకు సన్నద్ధమయ్యే వారికి ఏ విధంగా ఉపయోగకరంగా లేదు. రానున్న డీఎస్సీ పరీక్షకు చాలా మంది నిరుద్యోగుల ఎదురుచూస్తున్నారు. అధికారులు స్పందించి, అవసరమైన మెటీరియల్ ఏర్పాటు చేసి, అండగా నిలవాలి.

– రవి, నిరుద్యోగి, యాలాల

సౌకర్యాలు కల్పించాలి



శాఖ గ్రంథాలయంలో నిరుద్యోగ అభ్యర్థులు చదువుకోవడానికి పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. లైబ్రేరియన్ లేకపోవడం శోచనీయం. ఉద్యోగ ప్రకటనలు వెలువడుతున్న సమయంలో తగిన పుస్తకాలు లేకపోవడం.. నిరుద్యోగులకు ఇబ్బందికరమే. జ్ఞాన సంపదను ఏర్పాటు చేయాలి.

– ప్రభాకర్ చారి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు, యాలాల

ఘనంగా బసవేశ్వరుడి ఆరాధనోత్సవం



విశేష అలంకరణలో బసవేశ్వరుడు

కొడంగల్ రూరల్: శ్రీజగద్గురు నిరంజన మఠంలో బసవలింగేశ్వర స్వామివారి ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కాశీ జగద్గురు వేద పాఠశాల పురోహితులు మలికార్జున స్వామి, మఠం విజయకుమార్, గడ్డం చంద్రశేఖర్, శ్రీశైల వేద పాఠశాల మహేశ్‌కుమార్, లింగాయత్ సభ్యులతో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి బిల్వార్చన, శివాష్టకం, రుద్ర, నమక, చమక అధ్యాలతో వేదమంత్రాలతో చేపట్టగా.. భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి ఆలయం చుట్టూ పల్లకీ సేవ చేపట్టారు. ఈ సందర్భంగా స్టేట్ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మునిసిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ లింగాయత్ సంఘం సభ్యులు, తాండూరు సంఘం అధ్యక్ష కార్యదర్శులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మంగళహారతులు పట్టారు.

మహిళాభివృద్ధే బీజేపీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సంగీతా రెడ్డి

అనంతగిరి: మహిళల అభివృద్ధే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి సంగీతా రెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని రుద్రమదేవి సంస్థలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాన మంత్రి మోదీ.. మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ముద్ర పథకం కింద ఎన్నో రుణాలు ఇచ్చారని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మేలు జరగాలన్నా.. దేశం ఆర్థిక వ్యవస్థ మరింత బలపడాలన్నా బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె వెల్లడించారు.

ఉచిత మెడికల్ క్యాంపు



ప్రజలకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కుల్కచర్ల: గ్రామస్తుల ఆరోగ్య సంరక్షణకు కొంతమంది యువకులు ముందుకువచ్చారు. వైద్యం చేయించుకునేందుకు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడే వారికోసం స్థానికంగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన అన్నసారం శ్రీశైలం, పందుల బుగ్గయ్య, జెట్బూరి గోవర్ధన్, నాగముల్ల అంజి, కోమటి నర్సింలు మహావీర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని శిబిరం నిర్వహించారు. ఇందులో 328 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపక శక్తి పెంచేందుకే క్విజ్ పోటీలు



పోటీ నిర్వహిస్తున్న వెల్‌స్పన్ ఫౌండేషన్ నిర్వాహకులు

చేవెళ్ల: విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెంచేందుకే క్విజ్ పోటీలు తోడ్పడుతాయని చేవెళ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యాలక్ష్మి, అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం వెల్‌స్పన్ ఫౌండేషన్, శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాబాద్, చేవెళ్ల మండలాల్లోని మాచన్‌పల్లి, మద్దూరు, హైతాబాద్, తాళ్లపల్లి, కొకుంట్ల, కేజీబీవీ, చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. క్విజ్ పోటీలతో జనరల్ నాలేడ్జ్ పెరుగుతుందన్నారు. ప్రథమ బహుమతి కొకుంట్ల పాఠశాల, మద్దూరు పాఠశాలకు, రెండో బహుమతి చేవెళ్ల ప్రాథమిక పాఠశాల, హైతాబాద్ ఉన్నత పాఠశాలకు, మూడో బహుమతి మాచనపల్లి, కేజీబీవీ చేవెళ్ల పాఠశాల విద్యార్థులు గెలుపొందినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు సర్టిఫికేట్‌ల ప్రదానం చేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న శోభారాణి

- చేవెళ్ల ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి

షాబాద్: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని చేవెళ్ల ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి పేర్కొన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధి సీతారాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం శోభారాణి మాట్లాడుతూ పోషకాహార లోపాన్ని నిర్మూలించడమే పోషణాభియాన్ లక్ష్యమన్నారు. చిరుధాన్యాలతో కూడిన పదార్థాలు, అందుబాటులో ఉండే ఆకుకూరలు తినడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఎనిమియా వంటి వ్యాధులు సక్రమించవని సూచించారు. పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలని సూచించారు. 3నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్‌కు పంపించాలన్నారు. ప్రీస్కూల్ ప్రాముఖ్యత గురించి వివరించి, చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రక్తహీనత నివారణకు పౌష్టికాహారమే ఏకైక మార్గమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, సృజన, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యాయులు శ్రీశైలం ఉన్నారు.

అమ్మమ్మ జ్ఞాపకార్థం అంబలి కేంద్రం



అంబలి పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: కొడంగల్ కోటకు వారసురాలు అయిన దేశ్‌ముఖ్ పార్వతమ్మ జ్ఞాపకార్థం ఆమె మనుమడు, మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి కుమారుడు, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి బుధవారం అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలంలో పేదల దాహార్తి తీర్చడం కోసం కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, డీడీఎస్ అధ్యక్షుడు జయతీర్థాచారీ, మిఠాయి రాజు, కంటు, కుర్వ ఎల్లప్ప పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా సేవలు

- సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం
- తపాలా శాఖ తాండూరు ఇన్‌స్పెక్టర్ రాకేష్‌రెడ్డి



తపాలా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఉద్యోగులు, గ్రామస్తులు

యాలాల: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తపాలా శాఖ లక్ష్యమని ఆ శాఖ తాండూరు ఇన్‌స్పెక్టర్ రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి ముద్దాయిపేటలో పోస్ట్ ఆఫీస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సేవలు అందిస్తామని, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తామని వెల్లడించారు. జనాభా ప్రాతిపదికన కేంద్రం.. ఇటీవల కొత్తగా బీపీఓలను మంజూరు చేసిందని, అందులో ముద్దాయిపేట గ్రామం ఒకటన్నారు. తపాలా ఆధ్వర్యంలో ప్రజలకు ఎఫ్‌డీ, ఆర్‌డీ, సుకన్య సమృద్ధి, జీవన్‌జ్యోతి, గ్రామీణ తపాల జీవిత బీమా లాంటి పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. 30 సంవత్సరాలుగా తపాల శాఖ కోసం ఎదురుచూశామని, ఇప్పుడు ప్రారంభించడం సంతోషంగా ఉందని పలువురు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేవగారి రాములు, ప్రత్యేక అధికారి యాదగిరి, మాజీ సర్పంచ్‌లు కృష్ణయ్యగౌడ్, బిచ్చన్నగౌడ్, మెయిల్ ఓవర్‌సీర్ రాములు, యాలాల సబ్‌పోస్ట్ మాస్టర్ ఫిరోజ్ బాబా, పోస్టు మాస్టర్ వేణు, కృష్ణాచారీ, బీపీఎంలు అరుణ్‌కుమార్, శ్రీనివాస్, గ్రామస్తులు వాసిద్‌ఖాన్, రాజప్ప, సురేష్, ఆరిఫ్‌హుస్సేన్, బస్వరాజ్, గోపాల్ నాయక్, సిద్రామేశ్వర్, ప్రేమ్‌కుమార్, రాజుచారి తదితరులు ఉన్నారు.

మండే ఎండలతో జాగ్రత్త

- శీతల పానీయాలతో ప్రయోజనం శూన్యం
- తాగునీటితోనే వేసవి సంబంధిత సమస్యలు దూరం
- మధ్యాహ్న సమయమే.. వడదెబ్బకు కారణం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



డాక్టర్ రతన్‌లాల్

దౌల్తాబాద్: భానుడి ప్రతాపంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. మధ్యాహ్నం అయిందంటే చాలు రోడ్లన్నీ నిర్మాణుష్యంగా మారుతున్నాయి. దినచర్య కార్యక్రమంలో భాగంగా తప్పని సరిగా బయటకు వచ్చేవారు.. వేసవితాపం, వడదెబ్బ నుంచి బయట పడాలంటే కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.రతన్‌లాల్ పలు జాగ్రత్తలను సూచించారు.

సలహాలు, సూచనలు

మధ్యాహ్నం 12 నుంచి మూడు గంటల వరకు ఎండలో తిరగకూడదు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే.. గొడుగు తప్పనిసరి. దాహం వేసినప్పుడు పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి. రోజుకు ఐదు లీటర్ల నీటిని తాగితే.. వేసవి సంబంధిత వ్యాధులు దరిచేరవు. చల్లని పానియాలు సేవించడం వలన ప్రయోజనం శూన్యం. ఎండలో తిరగడం వలన వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. కూలి పనులు చేసేవారు మధ్యాహ్నం 12 నుంచి 3గంటల వరకు విరామం ఉండేలా చూసుకోవాలి. ఈ సమయంలో సూర్యుడి కిరణాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని వలన వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఎక్కువగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను నీటిలో కలిపి తాగాలి. ఈ ప్యాకెట్లు పీహెచ్‌సీ, సబ్ సెంటర్లలో అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద ఉచితంగా లభిస్తాయి. వేసవిలో విరేచనాలు ఎక్కువగా అయ్యే అవకాశం ఉంది. ఈ సమస్య తలెత్తినప్పుడు శరీరంలోని నీరు బయటకు వెళ్లి డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. శరీరంలోని నీటి శాతాన్ని పెంచుకునేందుకు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. వేసవిలో ఘన పదార్థాల కన్నా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

వడదెబ్బ లక్షణాలు.. ప్రథమ చికిత్స

- నాలుక పొడి బారుతుంది.
- టెంపరేచర్ పెరుగుతుంది.
- మనిషి స్పృహ తప్పిపోతాడు.
- ఇలా పడిపోయిన వ్యక్తులను చల్లని ప్రాంతానికి తరలించి, విశ్రాంతి తీసుకునే ఏర్పాటు చేయాలి.
- వడదెబ్బకు గురైన వ్యక్తికి వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరింపజేయాలి.
- ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగించాలి.
- జ్వరం ఉంటే పారాసిటమల్ మాత్రను వేయాలి.
- నీటిలో నిమ్మ రసం కొంచెం, పంచదార కలిపి పట్టించాలి.
- అనంతరం చికిత్స కోసం సమీపంలోని వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి.

కంటి వైద్యశిబిరాన్ని వినియోగించుకోండి



నేత్ర చికిత్స అవసరమైన వారిని హైదరాబాద్‌కు తరలించిన వైద్యులు

కుల్కచర్ల: కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు జిల్లా అంధత్వ నిర్వహణ సంస్థ నిర్వహిస్తున్న కంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఇన్‌చార్జి వైద్యాధికారి మాధురి, కంటివైద్య అధికారి జవహర్‌లు సూచించారు. బుధవారం మండల కేంద్రం ప్రభుత్వ ఆస్పత్రిలో 32 మందికి కంటివైద్య పరీక్షలు చేశారు. అందులో 27మంది శుక్లాలతో ఇబ్బంది పడుతున్నారని గుర్తించారు. వారిని శస్త్రచికిత్స కోసం హైదరాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వమే వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించి, రెండు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, ఇక్కడికి తీసుకురానున్నట్లు వెల్లడించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్, వైద్య సిబ్బంది యాదమ్మ, విజయలక్ష్మి, సుజాత, జంగమ్మ, రమేష్, శ్రీనివాస్ ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కౌన్సిలర్ కృష్ణవేణి దంపతులను పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు (బీఆర్ఎస్ సోలీపూర్ గ్రామానికి చెందిన) కౌన్సిలర్ కృష్ణవేణి, దిలీప్‌చంద్ర దంపతులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం అన్నారు. కార్యక్రమంలో బాబర్‌ఖాన్, రఘు, బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

చేవెళ్ల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోగలరని ప్రతి విద్యార్థి తప్పకుండా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో జనహిత సేవా సమితి వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు ఉచితంగా బ్లెడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థినులకు ఎనిమియా సమస్య ఉన్నవారికి ఐరన్, పోలిక్ యాసిడ్ మందులు అందజేశారు. ప్రతి విద్యార్థి తప్పని సరిగా ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్లెడ్ గ్రూపింగ్ గురించి తెలుసుకోవాలన్నారు. ఎవరికైనా అత్యవసరంగా రక్తం అవసరమైతే ఎవరి బ్లెడ్ గ్రూప్ వారికి తెలిస్తే వెంటనే వారికి అందించొచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధ్యాపకులను, జనహిత సేవా సమితి వారిని అభినందించారు. అనంతరం జనహిత సేవా సమితి ప్రతినిధి నర్సింహమూర్తి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలతో పేద విద్యార్థులకు వైద్యం అందించటమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి డాక్టర్ జ్యోతి, అధ్యాపకులు అనురాధ, షేక్ మహబూబ్, మల్లయ్య, వైష్ణవి, సతీశ్, రవీందర్, శకుంతల, వెంకటేశ్వర్లు, వీరేశం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.